మంగళవారం జనవరి 6, 2004

# మోతాదు మించితే మొదటికే మోసం



డా॥ కె.డి. మోడి
ఎండోక్రినాలజిస్ట్
మెడ్విన్ హాస్పిటల్

**సమస్య + సలహా**

❑ మా నాన్న 30 సంవత్సరాలుగా థైరాయిడ్ సమస్య కోసం మాత్రలు తీసుకుంటున్నారు. అదే సమస్య ఇప్పుడు మా చెల్లెలికి(35), మేనకోడలికి కూడా వచ్చింది. వీళ్లు మాత్రలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. భయం, ఆందోళన, గుండె నొప్పి, చెమటలు పట్టడం, నీరసంలాంటి సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి పరిష్కారం ఏమిటి?

-వి.సంజీవరావు, కావలి


☆ థైరాయిడ్ సమస్య జన్యుపరంగా, వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కొంత ఉంది. మీరు రాసినట్టు మీ వాళ్లకు- చెమటలు పట్టడం, నొప్పి, ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తున్నాయంటే వారు థైరాయిడ్ మందులను మోతాదుకు మించి అధికంగా తీసుకుంటున్నారని అర్థమవుతోంది. థైరాయిడ్ హార్మోను లోపంతో బాధపడుతున్న వారిలో 99 శాతం మందికి 'థైరాక్సిన్' మందులు ఇవ్వడం ద్వారా సమస్య చక్కగా తగ్గిపోతుంది. అయితే కొంతమంది మందులు ఎక్కువ వేసేసుకుంటే సమస్య త్వరగా తగ్గిపోతుందని అపోహపడుతూ మోతాదు పెంచి వేసుకుంటారు. ఇలా మోతాదుకు మించి తీసుకోవటం చాలా హానికరం. థైరాక్సిన్ మాత్రల్ని అవసరానికి మించి తీసుకుంటే గుండెదడ, ఆందోళన, చెమటలు పట్టటం వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతే కాదు, ఒకవేళ లోపల ఏదైనా గుండె జబ్బు ఉంటే దీనివల్ల అది ఉద్ధృతమయ్యే ప్రమాదమూ ఉంది. కాబట్టి మందులను ఎక్కువ మోతాదులు తీసుకోవటం శ్రేయస్కరం కానేకాదు. చాలాసార్లు బాధితులు తమకు సమస్య అదుపులో ఉండటం లేదని అనుకుంటూ ఉంటారు కానీ, అప్పటికే అది అవసరానికి మించి [illegible]పులోకి వచ్చి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో- థైరాయిడ్ పరీక్ష చేసినా ఫలితం నార్మల్‌గా ఉండదు. నార్మల్‌గా లేదు కాబట్టి జబ్బు అదుపులోకి రాలేదనుకుని మోతాదు ఇంకా పెంచుకుంటారు. ఇది చాలా తప్పు. కాబట్టి కేవలం లక్షణాల ఆధారంగానే సమస్య అదుపులో ఉందా? లేదా? అంచనా వేసుకోకుండా ప్రతి 3, 6 నెలలకోసారి టీఎస్‌హెచ్ పరీక్ష చేయించుకోవటం మంచిది. దీనిలో టీఎస్‌హెచ్ సాధారణ స్థాయిలోనే ఉంటే బాగానే ఉందనుకోవాలి. అది సరైన పద్ధతి.

## ఆపరేషన్ అవసరం లేదు

❑ మా పెళ్లయి నాలుగేళ్లవుతోంది. పెళ్లయిన మూడేళ్లకు సంతానం కలిగింది. మా ఆవిడ వయసు 25 సంవత్సరాలు. ఆమెకు థైరాయిడ్ సమస్య వచ్చింది. కాన్పుకు ముందు రక్త పరీక్షలు చేయిస్తే 'నిల్' అని రిపోర్టు వచ్చింది. తర్వాత గొంతు దగ్గర లావుగా కనిపిస్తే డాక్టర్‌కు చూపించాం. థైరాయిడ్ గ్రంథి వాపు వచ్చిందనీ, ఆపరేషన్ చెయ్యాలనీ చెప్పారు. ప్రస్తుతం మాత్రలు వాడుతున్నాం. దీనికి ఆపరేషన్ ఒక్కటే పరిష్కారమా?

-లక్ష్మీభాస్కర్, గుంటూరు

☆ కాన్పు తర్వాత వచ్చే థైరాయిడ్ సమస్యను 'పోస్ట్‌పార్టం థైరాయిడైటిస్' అంటారు. ఇది సాధారణంగా కనిపించే సమస్యే. దీనికి ఆపరేషన్ చెయ్యాల్సిన అవసరం ఉండదు. మీ భార్యకు వచ్చిన సమస్య నిజంగా 'పోస్ట్‌పార్టమ్ థైరాయిడైటిస్సే' అయితే, సర్జరీ అవసరం ఉండదు. ఒకవేళ థైరాయిడ్ వాపు ఇబ్బందిగా ఉన్నా, సూదితో అక్కడి నుంచి స్రావాలు తీసి చేసే పరీక్షలో ఏదైనా అసాధారణ మార్పులున్నాయని తేలినా- అప్పుడు మాత్రమే ఆపరేషన్ గురించి ఆలోచించాల్సి ఉంటుంది. కాన్పు తర్వాతవచ్చే థైరాయిడ్ సమస్యలో ఇలాంటి ఇబ్బందులు అరుదనే చెప్పాలి. మీ భార్యది కాన్పు తర్వాత వచ్చే థైరాయిడ్ సమస్యా? కాదా? తెలుసుకునేందుకు 'థైరోడ్ యాంటీబోడీ' పరీక్ష చేయించండి. సమస్య అదేనని తేలితే ఆపరేషన్ అవసరం లేదు. చికిత్స మాత్రం తీసుకోవాలి.




## బరువు తగ్గుతామా?

3. నా వయసు 19 సంవత్సరాలు. నేను చాలా సన్నగా ఉంటాను. బరువు 36 కిలోలు. డాక్టర్‌కి చూపిస్తే థైరాయిడ్ ఉందని చెప్పారు. నా గొంతు వాపుగా ఉంటుంది. అందరూ థైరాయిడ్ సమస్య ఉంటే బాగా లావెక్కుతారు కదా, నేను మాత్రం సన్నగా మారిపోతున్నాను. ఈ సమస్య మా అమ్మకి కూడా ఉంది. నేను పెళ్లి చేసుకోవచ్చా? థైరాయిడ్ ఉంటే పిల్లలు పుట్టరని విన్నాను. నిజమేనా? నాకు పిల్లలు పుడతారు కదా? నా సందేహానికి సమాధానం ఇవ్వగలరు.

-స్వాతి, తిరుపతి

☆ సాధారణంగా థైరాయిడ్ హార్మోను లోపించిన వారు (హైపో థైరాయిడిజం) కొద్దిగా లావెక్కటం సహజమే. శరీరంలో వాపు కనిపిస్తుంది. అదే థైరాయిడ్ హార్మోను ఎక్కువైన వారిలో (హైపర్ థైరాయిడిజం) సమస్య దీనికి పూర్తి విరుద్ధంగా కనిపిస్తుంది. వీళ్లు సన్నబడిపోతారు. బరువు తగ్గిపోతారు. చెమట ఎక్కువగా పట్టటం, గుండెదడ వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి మీరు ముందు సమస్య ఏమిటో నిర్ధారించుకోవాలి. ఈ రెండింట్లో సమస్య ఏదైనా- చికిత్స తీసుకుని, మందులు వాడుకుంటే తగ్గిపోతుంది. అందరిలాగే సాధారణ జీవితాన్ని గడపవచ్చు. పెళ్లి చేసుకోవచ్చు. బిడ్డల్ని కనచ్చు. క్రమం తప్పకుండా మందులు మాత్రం వాడుకుంటూనే ఉండాలి. వాటిని ఆపకూడదు.

## ఎదుగుదలకూ థైరాయిడ్‌కూ లింకు!

❑ నా వయసు 15 సంవత్సరాలు. నేను చాలా పొట్టిగా ఉంటాను. అందరితో పాటు తిరిగేటప్పుడు చాలా బాధగా ఉంటుంది. థైరాయిడ్ సమస్య ఉంటే పొట్టిగా మారతారా? నేను చికిత్స తీసుకుంటే పొడవుగా పెరిగే అవకాశం ఉందా?

-పి.కృష్ణ, వరంగల్

☆ థైరాయిడ్ లోపం కారణంగా పిల్లల్లో ఎదుగుదల లేకపోవటమనేది చాలా సర్వసాధారణంగా కనిపించే సమస్యే. ఎదుగుదల వయసుకు తగినట్లుగా లేదని అనుమానం వస్తే- వెంటనే థైరాయిడ్ సమస్య ఉందేమో పరీక్ష చేయించుకోవాలి. థైరాయిడ్ హార్మోను లోపం ఉంటే మందులు తీసుకోవటం ద్వారా దానిని తగ్గించుకోవచ్చు. ఆ తర్వాత ఎదుగుదల ఎప్పటిలాగే మామూలుగా ఉంటుంది. థైరాయిడ్ పరీక్షలో సమస్య ఏమీ లేదని తేలితే మాత్రం- రక్తహీనత వంటి ఇతరత్రా సమస్యలేమైనా ఉన్నాయేమో పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది. ఇంట్లో అంతా చిన్నగానే ఉంటున్నారేమో చూసుకోవాలి. మూత్రపిండాలు, కాలేయాలకు సంబంధించిన సమస్యలేమైనా ఉన్నాయేమో తెలుసుకోవాలి. ఈ పరీక్షల్లో కూడా ఫలితాలన్నీ సాధారణంగానే ఉంటే అప్పుడు- 'గ్రోత్ హార్మోన్' ఎలా ఉందో పరీక్షించాలి. మీరు డాక్టర్‌ను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకుని ఆ మేరకు చికిత్స తీసుకోవటం అవసరం.

గమనిక: సుఖీభవ అందించే వార్తలుపాఠకుల అవగాహనకు మాత్రమే. నిపుణుల చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు.